



సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

దౌల్తాబాద్/యాలాల, జూలై 8: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఎస్సై రవిగౌడ్ తెలిపారు. సోమవారం దౌల్తాబాద్‌లో సైబర్‌నేరాలు, దొంగతనాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలన్నారు. అలాగే యాలాలలో టీఎస్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సైబర్‌మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పదవులు దక్కినవారు సంతోషంలో ఉంటే.. రానివారు నారాజ్‌లో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ల జాబితాలో ఐదుగురికి చోటు దక్కింది. ఇందులో ఇద్దరు వికారాబాద్ జిల్లాకు చెందిన వారు కాగా.. ముగ్గురు రంగారెడ్డి జిల్లా వారున్నారు. మేడ్చల్ జిల్లా నుంచి ఒక్కరికి కూడా ప్రాతినిధ్యం లభించలేదు. అయితే, ఉమ్మడి జిల్లా నుంచి అనేకమంది నామినేటెడ్ పదవుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. కానీ, చాలా మందికి ఆ పదవులు దక్కలేదు. దీంతో వారంతా నిరుత్సాహంగా ఉన్నారు. తొలి విడత జాబితాలో పదవి దక్కకున్నా రెండో జాబితాలోనైనా తప్పకుండా పదవి వస్తుందన్న ఆశతో ఉన్నారు.





కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన ఉమ్మడి జిల్లా నేతలు

పేరు	పదవి
ఆర్.గురునాథ్‌రెడ్డి	రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్
కాల్వ సుజాత	రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్
మల్‌రెడ్డి రాంరెడ్డి	రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్
చల్లా నర్సింహారెడ్డి	పట్టణ ఫైనాన్స్ కార్పొరేషన్
జ్ఞానేశ్వర్ ముదిరాజ్	ముదిరాజ్ కార్పొరేషన్

మా సంగతేంటి?

ఐదుగురికి దక్కిన రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవులు

- మేడ్చల్ జిల్లాకు మొండిచేయి
- నారాజ్‌లో సీనియర్లు

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్/మేడ్చల్, జూలై 8)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని కాంగ్రెస్ నేతలు ఐదుగురికి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. గతంలో పార్లమెంట్ ఎన్నికలకు ముందు ప్రకటించిన వారికే పదవులు కట్టబెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇందులో ఒకరికి గతంలో ఇచ్చిన పదవికి బదులు మరో పదవిని కేటాయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్ల చైర్మన్లు రెండేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగనున్నారు. ఇదిలా ఉంటే మేడ్చల్ జిల్లా నుంచి ఏ ఒక్కరికీ ప్రాతినిధ్యం లభించలేదు. దీంతో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నేతలు తీవ్ర నిరాశలో ఉన్నారు. అలాగే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో కూడా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న సీనియర్లు తాజాగా విడుదల చేసిన జాబితాలో తమకు అవకాశం దక్కక పోవడంతో నిరాశ చెందారు. త్వరలో విడుదలయ్యే రెండో జాబితాలోనైనా అవకాశం దక్కుతుందా? లేదా? అని ఆశగా ఎదురు చూస్తున్నారు. పదేళ్ల తరువాత అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ సీనియర్లు అనేక మంది నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్న విషయం తెలిసిందే. అధికారంలోకి రాగానే మొత్తం రాష్ట్ర స్థాయిలో 54 నామినేటెడ్ పోస్టులను రద్దు చేసిన కాంగ్రెస్ సర్కార్ ఈ స్థానంలో తమ పార్టీ నేతలను నియమించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ఈ మేరకు 35 మందితో తొలి జాబితా విడుదల చేసింది. అయితే ఇదే సమయంలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఈ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఈ జాబితాలో స్వల్ప మార్పులు చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా నుంచి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డికి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కగా కాల్వ సుజాతను ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించారు. ఇక రంగారెడ్డి జిల్లాకు మూడు పదవులు దక్కాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని పట్టణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. మల్‌రెడ్డి రాంరెడ్డికి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించారు. వాస్తవానికి గతంలో ఇచ్చిన జాబితాలో జ్ఞానేశ్వర్‌కు డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవి ఇవ్వగా తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల్లో దీన్ని మార్చి ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఇక మేడ్చల్ జిల్లా నుంచి ఒక్కరికి కూడా అవకాశం దక్కలేదు. దీంతో స్థానిక కాంగ్రెస్ నేతలంతా నారాజ్‌గా ఉన్నారు. రెండో జాబితాలోనైనా అవకాశం దక్కుతుందని ఎదురు చూస్తున్నారు. కొందరు నేతలు రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ కోరుతుండగా ఇంకొందరు జిల్లా స్థాయి పోస్టులను అడుగుతున్నారు. పదవులు దక్కించుకునేందుకు సన్నిహిత మంత్రులు, ఏఐసీసీ, టీపీసీసీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు.



గురునాథ్‌రెడ్డి | కాల్వ సుజాత | మల్‌రెడ్డి రాంరెడ్డి | జ్ఞానేశ్వర్ ముదిరాజ్

ఆశావహులు వీరే

నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్న వారిలో మాజీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి నామినేటెడ్ రేస్‌లో ఉన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి సానెం శ్రీనివాస్ గౌడ్, సామ రాజ్‌పాల్ రెడ్డి , రాచమల్లు సిద్ధేశ్వర్ నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నారు. చేవెళ్ల అసెంబ్లీ స్థానం నుంచి గతంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడిన నేతలు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ధరణి కమిటీ సభ్యుడు ఎం. కోదండరెడ్డికి త్వరలో ఏర్పాటు కానున్న వ్యవసాయ కమిషన్‌లో కీలక పదవి వరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, కొత్త కుర్మ శివకుమార్, కొంగరి విష్ణువర్ధన్‌రెడ్డి, కప్పాటి పాండురంగారెడ్డి పదవులు ఆశిస్తున్నారు. అలాగే కల్వకుర్తి నియోజకవర్గంలో ఆమనగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్, మైసిగండి మాజీ ఎంపీటీసీ అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు సూదిని రామిరెడ్డి , గూడురు శ్రీనివాస్‌రెడ్డి , వై.నర్సింహ, వి.జంగయ్య నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నారు. అలాగే మేడ్చల్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు సీనియర్ నేతలు హరివర్ధన్‌రెడ్డి, నక్కా ప్రభాకర్‌గౌడ్, నర్సిరెడ్డి భూపతిరెడ్డి రేస్‌లో ఉన్నారు. సుధీర్‌రెడ్డికి ఆర్టీసీ చైర్మన్ ఇస్తారనే ప్రచారం సాగుతోంది. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఎనుముల తిరుపతిరెడ్డి, నందారం ప్రశాంత్, వికారాబాద్ నియోజకవర్గం నుంచి మునిసిపల్ మాజీ చైర్మన్ వి.సత్యనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, గుడిసె లక్ష్మణ్, ఎర్రవల్లి జాఫర్, మహిపాల్‌రెడ్డి తదితరులు నామినేటెడ్ పదవుల రేసులో ఉన్నారు. తాండూరు నియోజకవర్గం నుంచి మురళీకృష్ణగౌడ్, కరణం పురుషోత్తం రావు, సునీతా సంపత్, ధారాసింగ్, పరిగి నియోజకవర్గం నుంచి లాల్‌కృష్ణ ప్రసాద్, రాములు, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, పరశురాంరెడ్డి, పాలాది శ్రీనివాస్, ఎర్రగడ్డపల్లి కృష్ణ, రామకృష్ణ, హన్మంత్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు.



చల్లా నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు

బాధ్యతలు స్వీకరించిన చల్లా నర్సింహారెడ్డి

రంగారెడ్డి అర్బన్ : తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కో-ఆపరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా చల్లా నర్సింహారెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఆయన కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్‌లో పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా నర్సింహారెడ్డిని శాలువాలు కప్పి గజమాలతో సన్మానించారు. సన్మానించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు చల్లా బాల్‌రెడ్డి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, పైల శేఖర్‌రెడ్డి, కాల కుమార్, సంతోష్, సైదులు, మురళీగౌడ్, పరశురాం, కీసర యాదిరెడ్డి, విజయరెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులున్నారు.

ఏసీబీ అధికారులమంటూ టోకరా

ఎంపీడీవో నుంచి రూ.5లక్షలు వసూలు చేసిన కేటుగాళ్లు 7

స్థానిక పోరుపై సందిగ్ధం!

- బీసీ రిజర్వేషన్లపై స్పష్టత కరువు
- ఆశావహుల్లో ఉత్కంఠ
- స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం



వికారాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని అప్పట్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. ఆ దిశగా ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. గడువు తీరిన గ్రామ పంచాయతీల ఎన్నికలకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలా కనిపించడం లేదు. గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసి ఇప్పటికే ఐదు నెలలు గడిచిపోయాయి. 2024, ఫిబ్రవరి ఒకటో తేదీతో గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగిసియగా, పాలక వర్గాల స్థానంలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మండల ప్రజా పరిషత్ పాలకవర్గాల గడువు ఈనెల 3వ తేదీతో ముగియగా, ఈనెల 4వ తేదీతో జిల్లా ప్రజా పరిషత్తు పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగిస్తారా? లేక సవరణ చేసి అమలు చేస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ రిజర్వేషన్లు మార్చి అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తే.. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల వివరాలను సేకరిస్తారా? లేక బీసీ కులగణన ఆధారంగా ఖరారు చేస్తారా అనేది తెలియాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుపై బీసీ కమిషన్ నివేదిక కీలకం కానుంది. పంచాయతీలు, మండల, జడ్పీ ప్రజా పరిషత్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వాటా ఏ మేర ఉండనుందనేది రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వికారాబాద్ జిల్లాలో జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు ఉండగా, 20 మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ ఉంది. మండల పరిషత్‌లలో ఇది వరకే 18 మండల ప్రజా పరిషత్‌లు ఉండగా, దుద్యాల, చౌడాపూర్ మండలాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. ఈసారి జరిగే ఎంపీటీసీ ఎన్నికల్లో ఈ రెండు మండలాల్లో మండల పరిషత్ పాలక వర్గాలు కొలువు తీరనున్నాయి.

2018లో కొత్త చట్టం అమల్లోకి..

నూతన పంచాయతీరాజ్ చట్టం - 2018 ప్రకారం స్థానిక సంస్థల్లో ఒకసారి ఖరారైన రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమలు చేసేలా ఈ చట్టంలో మార్పు తీసుకు వచ్చారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత 2019 జనవరి నెలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగగా, మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. అదే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాక ముందే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సన్నాహాల్లో అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామ పంచాయతీలు, వార్డులకు సంబంధించిన సమాచారం సిద్ధం చేశారు. ఓటింగ్ కోసం అవసరమయ్యే పోలింగ్ బాక్సులు కూడా సిద్ధం చేసుకున్నారు.

తెరపైకి కులగణన

లోక్‌సభ ఎన్నికలు తరువాత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని భావించినా బీసీ రిజర్వేషన్ల అంశంపై తేల్చకపోవడం, కులగణన డిమాండ్ తెరపైకి రావడంతో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పంచాయతీలు, మండల, జడ్పీ ప్రజా పరిషత్తు పాలక వర్గాల పదవీ కాలం ముగిసింది. స్థానిక సంస్థలకు ఐదేళ్ల పదవీ కాలం ముగియగానే కొత్త పాలక వర్గాలు కొలువుదీసే విధంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. కాగా, బీసీ రిజర్వేషన్ల అంశం తేలకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరగనున్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది. మునిసిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం మరో ఆరు నెలల్లో ముగియనుంది. వచ్చే ఏడాది జనవరిలో మునిసిపాలిటీలు, ఆ తరువాత వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘ (పీఏసీఎస్) పాలకవర్గాల పదవీ కాలం ముగియనుంది.

రిజర్వేషన్లపై ఉత్కంఠ ..

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లు ప్రధాన అడ్డంకిగా మారాయి. గత ప్రభుత్వం అమల్లోకి తీసుకు వచ్చిన పంచాయతీరాజ్ చట్టం-2018 ఎన్నికల స్థానాలకు రిజర్వేషన్లు పదేళ్ల పాటు వర్తిస్తాయని పేర్కొంటోంది. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక రిజర్వేషన్లలో ఏమైనా మార్పులు చేస్తుందా అనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించే అవకాశంపై రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో వైపు బీసీ గణన అంశంపై తెరపైకి వచ్చిన నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందనేది స్పష్టమవుతోంది.

గత ఎన్నికల్లో 50 శాతానికి లోబడి..

గత పంచాయతీ ఎన్నికల్లో 2011 జనాభాను పరిగణనలోకి తీసుకుని ఎస్టీ, ఎస్సీలకు రిజర్వేషన్లు నిర్ధారించారు. బీసీలకు మాత్రం 50 శాతం కోటా మించరాదన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా వీరికి సర్పంచ్ పదవులను రిజర్వు చేశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కల్పించగా, 50 శాతం మించకుండా అమలు చేస్తున్న రిజర్వేషన్లలో బీసీలకు ఈసారి 22.78 శాతం మాత్రమే రిజర్వేషన్లు దక్కాయి. 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వు చేయగా, 2019 ఎన్నికల్లో మాత్రం 22.78 శాతం రిజర్వేషన్ అమలు చేశారు.



ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

- కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం ప్రజావాణిని పురస్కరించుకుని కలెక్టర్ కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వనమహోత్సవం కింద అధికారులకు వారికి నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రూరల్, గ్రామపంచాయతీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లా కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో బయోమెట్రిక్ విధానాన్ని త్వరలో అమలు చేస్తున్నామన్నారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్ : ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదును స్వీకరించి మాట్లాడారు. ప్రధానంగా విద్య, వైద్య, బీసీ, గిరిజన సంక్షేమం, విద్యుత్ , పంచాయతీ, పింఛన్లు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, భూసర్వే తదితర అంశాలకు సంబంధించి 122 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజావాణితో పాటు సీఎం కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ పరిష్కరించాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఇక నుంచి మండలాల్లో నిర్వహించే ప్రజావాణిలో అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు., నియోజకవర్గ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్ ,ఆర్‌డీవో వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సంస్థల రిజర్వేషన్లను మార్చొద్దు

షాద్‌నగర్ అర్బన్, జూలై 8: పల్లెల ప్రగతి కోసం స్థానిక సంస్థల్లో పదేళ్ల ఒకే రిజర్వేషన్ విధానాన్ని కొనసాగాలని, చట్ట ప్రకారం రానున్న స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లను మార్చొద్దని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ కింగ్‌ప్యాలెస్‌లో సోమవారం బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీ లు, సర్పంచ్‌లను ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పల్లెలు బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి చెందాయన్నారు. పదేళ్లు ఒకే రిజర్వేషన్ ఉంటే పల్లెల్లో అభివృద్ధి జరుగుతుందనే కేసీఆర్ ప్రభుత్వం రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేసిందని గుర్తు చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం ముగిసినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడం, కనీసం ఇన్‌చార్జిలుగా పదవుల్లో అయినా కొనసాగించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనుల బిల్లులు, ప్రజాప్రతినిధుల వేతన బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారం లేదని ఎవరూ అధైర్యపడొద్దని, పార్టీ మారొద్దని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజాభిమానాన్ని కోల్పోతున్నదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, వైస్‌చైర్మన్ నటరాజ్, ప్యాక్స్ చైర్మన్లు గణేష్, బక్కన్నయాదవ్, నాయకులు వి.నారాయణరెడ్డి, రాజావరప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మీనర్సింహారెడ్డి, సత్యనారాయణ,రాజ్యలక్ష్మి,మిట్టు నాయక్, నారాయణ, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ గణేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

రైతులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

ఇబ్రహీంపట్నం, జూలై 8:రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్యయాదవ్, జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ అనితకు వినతిపత్రమందజేశారు. వానకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా రైతు భరోసా ఇవ్వడం లేదని విమర్శించారు. రైతులకు 2లక్షల పంట రుణమాఫీ చేయలేదన్నారు. కౌలు రైతులకు ఇస్తామన్న సాయం, రైతు కూలీలకు ఏడాదికి ఇస్తామన్న రూ.12వేలు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ప్రధాన్‌మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కె.విఠల్‌రెడ్డి, నాయకులు ముత్యాల భాస్కర్, నర్సింహారెడ్డి, రాములు, వెంకటేష్‌గౌడ్, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న మోర్చా నాయకులు

రైతుల సమస్యలు తీరుస్తాం


మంతన్‌గౌరెల్లిలో రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్‌కుమార్

యాచారం, జూలై 8: ధరణి పోర్టల్‌లో అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యలన్నింటిని పరిష్కరించేందుకే రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నామని, రైతుల సమస్యలను తీరుస్తామని ధరణి కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, సునిల్‌కుమార్ అన్నారు.ధరణి పోర్టల్‌లో రైతుల భూముల వివరాలు నమోదు కాక ఇబ్బందులు పడుతున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమవారం మంతన్‌గౌరెల్లిలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ధరణి పోర్టల్‌లో భూముల వివరాలు నమోదుకాక ప్రభుత్వాలు అందించే ఆర్థిక సాయాన్ని పొందలేకపోవడం అన్యాయం అన్నారు. గత ప్రభుత్వంలో ధరణి లోటుపాట్లను అధికారులు సవరించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఆందోళన కల్గిస్తోందన్నారు. పోర్టల్‌లో భూమి వివరాలు నమోదు కాక రైతుబంధు, బీమా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలన్నీ తీర్చి రైతులకు న్యాయం చేస్తామన్నారు. తమ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ధరణి పోర్టల్‌ను రద్దుచేసి మరో పథకాన్ని అమలు చేసేందుకు పూనుకుందని తెలిపారు. పట్టా భూముల్లో సాగుచేసుకుంటున్న రైతులకు ధరణి పోర్టల్‌లోని దొర్లిన తప్పుల కారణంగా రైతుబంధు, రైతుబీమా, కిసాన్ సమ్మాన్ వంటి పథకాలు వర్తించలేదన్నారు. తప్పులను సవరించాలని ఏళ్లుగా రైతులు కార్యాలయాలకు తిరుగుతున్నా గత పాలకులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు తీర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీలు అరవింద్‌నాయక్, జ్యోతి, లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

మిగిలి ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి

ఆమనగల్లు, జూలై 8: జిల్లాలో సబ్జెక్టుల వారీగా మిగిలి ఉన్న ఉపాధ్యాయుల ప్రమోషన్లను వెంటనే చేపట్టి ఉన్నత పాఠశాలలను బలోపేతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు కోరారు. సోమవారం ఆమనగల్లులో విలేఖరులతో ఆయన మాట్లాడారు. పదోన్నతుల సందర్భంగా ఒక్కో ఉపాధ్యాయునికి వేర్వేరు సబ్జెక్టులలో పదోన్నతులు కల్పించారని, వారు ఏదో ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవడంతో మిగతా సబ్జెక్టుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేయడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించి ఇబ్బందులు తీర్చాలన్నారు. పారిశుధ్య పనివారు లేక తరగతి గదులు, పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని కాశీరావు పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న కాశీరావు

ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి


వినతిప్రతం ఇస్తున్న నాయకులు

చేవెళ్ల, జూలై 8: గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం పేదలతో కలిసి సీపీఐ నాయకులు చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో సాయిరాంకు వినతిప్రతం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలోని సర్వే నంబర్ 75లో గత నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారని, వారికి విద్యుత్, నీళ్ల కనెక్షన్ ఇవ్వాలని కోరారు. పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ, సంఘాల నాయకులు రామస్వామి, ఎం.ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, అంజయ్య, సత్తిరెడ్డి, సుధీర్, జంగయ్య, శ్రీనివాస్, మక్బుల్, శౌరి, మంజులు, శివ, శివయ్య, రఘు, నారాయణ, మధులత, విజయమ్మ, జయమ్మ, ఆనందం, యాదగిరి, నర్సింలు తదితరులు ఉన్నారు.

హజ్ యాత్రికులకు ఘన స్వాగతం

శంషాబాద్ రూరల్, జూలై 8: ఆల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎండీ అల్హజి ఫయాజ్ అలీ ఆధ్వర్యంలో ఇటీవల 50మంది హజ్ యాత్రకు వెళ్లారు. ఉమ్రా యాత్ర పూర్తిచేసుకొని సోమవారం యాత్రీకులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకోగా వారికి కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు.యాత్ర పూర్తిచేసుకున్న వారిలో తెలంగాణ, ఏపీ, గుల్బర్గా వారున్నారు.మరిన్ని బృందాలు జూలై 29, ఆగస్టు 21, సెప్టెంబరు 9న రానున్నారని తెలిపారు.



హజ్ యాత్ర పూర్తి చేసుకొని వచ్చిన యాత్రికులు



పల్లెల పరిశుభ్రతపై ప్రత్యేక చొరవ

బషీరాబాద్, జూలై 8: పల్లెల పరిశుభ్రతపై ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ఎట్టకేలకు దృష్టి సారించారు. మండలంలోని బషీరాబాద్, మైల్వార్, దామర్‌చెడ్, ఎక్మాయి, కొర్విచెడ్, నవాల్గ తదితర గ్రామాల్లో వర్షకాలం దృష్ట్యా మురుగు కాల్వలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ప్రధాన, అంతర్గ రోడ్లపై చెత్త చెదారం, పక్కన పిచ్చి మొక్కలనును కార్యదర్శులు పారిశుధ్య కార్మికులతో దగ్గరుండి తీయించారు. గ్రామంలోని అంతర్గత రోడ్లపై నీటి నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే ఆవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ఆయా గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో రాఘవులు, ఎంపీవో రమేష్ సోమవారం పరిశీలించారు.


కొర్విచెడ్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుధ్య కార్మికుడు





అటవీ ఇన్‌చార్జి రేంజ్ అధికారిగా అబ్దుల్లా

తాండూరు, జూలై 8: తాండూరు ఇన్‌చార్జి అటవీ రేంజ్ అధికారిగా పరిగి అటవీ రేంజ్ అధికారి అబ్దుల్లా సోమవారం ఎట్టకేలకు బాధ్యతలు చేపట్టారు. తాండూరు అటవీ రేంజ్ అధికారిగా ఉన్న శ్యాంసుందర్ కూలీల బోనస్ డబ్బుల స్వాహ కేసులో సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. వారం రోజుల కిందటే సస్పెన్షన్‌కు గురికాగా అబ్దుల్లాకు బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయినప్పటికీ చార్జీ తీసుకోవడంలో జాప్యం జరిగింది. సస్పెన్షన్ ఎత్తివేసేందుకు శ్యాంసుందర్ ప్రయత్నాలు చేశారు. అటవీశాఖ ఉన్నతాధికారులు ఈవిషయాన్ని సీరియస్‌గా తీసుకుని వెంటనే చార్జి తీసుకోవాలని అబ్దుల్లాను ఆదేశించడంతో సోమవారం తాండూరుకు వచ్చిన అబ్దుల్లా చార్జి తీసుకొని డీఎఫ్‌వో కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. అబ్దుల్లా ప్రస్తుతం కొడంగల్ అటవీ రేంజ్ ఇన్‌చార్జి అధికారిగా ఉన్నారు.


అబ్దుల్లా

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 8: ప్రతీఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ఉప్పల్ ఆర్టీవో ఎస్.వాణి తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం జరిగిన వన్ వీక్ ఫ్యాకల్టీ ప్రోగ్రాంలో ఆమె పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు విజయ్‌కుమార్, నరేందర్, ఎఫ్‌డీపీ కన్వీనర్ మధుసుదన్‌రెడ్డి, అధ్యాపకులు వెంకట్రావు, చలపతి పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఆర్టీవో వాణి

మొహర్రం ఉత్సవాలు ప్రారంభం

కొడంగల్, జూలై 8: హిందూ, ముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కొడంగల్ పట్టణంలోని జామేమస్జిద్ సమీపంలో, మహిబూబ్‌సుభానీ దర్గా దగ్గర పీర్లను ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


కొడంగల్‌లో ప్రతిష్ఠించిన పీర్లు


రేగడిమైలారంలో బోనాలు తీసుకువెళ్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో బోనాలు

బొంరాస్‌పేట్, జూలై 8: బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామంలో సోమవారం కాటమరాజుకు గ్రామస్థులు బోనాలతో ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు, గ్రామస్థులు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు శ్యామలయ్యగౌడ్ పోతురాజు వేసాధారణతో భక్తులను ఆకట్టుకున్నారు.

బదిలీలపై వెళ్తున్న ఉపాధ్యాయులు

» ఎమ్మార్సీ వద్ద నెలకొన్న హడావిడి

కొందుర్గు, జూలై, 8: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద సోమవారం సాయంత్రం బదిలీలపై వెళ్తున్న ఉపాధ్యాయులతో హడావిడి నెలకొంది. మండలంలోని 33 ప్రాథమిక పాఠశాలల్లో, జిల్లేడ్-చౌదరిగూడ మండలంలోని 39 పాఠశాలల్లోని ఎస్జీటీలకు బదిలీలు అయ్యాయి. కొందుర్గు మండలం నుంచి ఫరూఖ్‌నగర్, కొత్తూర్, నందిగామ, శంషాబాద్ మండలాలకు బదిలీ అయ్యారు. సోమవారం సాయంత్రం రిలీవింగ్ ఆర్డర్లు తీసుకొని, బదిలీ అయిన స్కూళ్లకు బయలుదేరారు. దీంతో ఎమ్మార్సీలో ఉపాధ్యాయుల సందడి నెలకొంది. ఒక్కో పాఠశాలలో 10 పదేళ్ల నుంచి 15 సంవత్సరాల వరకు పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీలపై వెళ్లారు. సాయంత్రం 7గంటల వరకు కొందుర్గు మండలం నుంచి 33మంది బదిలీపై వెళ్లగా, 25మంది ఉపాధ్యాయులు ఇతర మండలాల నుంచి కొందుర్గు మండలానికి వచ్చారు. జిల్లేడ్-చౌదరిగూడ మండలం నుంచి 50మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా, 13 మంది టీచర్లు ఇతర మండలాల నుంచి కొత్తగా వచ్చారు.

వేతన బకాయిలు ఇప్పించాలి

ఆమనగల్లు, జూలై 8 : పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఎంపీడీవో కుసుమమాధురిని కోరారు. సోమవారం మండల పరిషత్‌లో ఎంపీడీవోకు కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, తమకు కుటుంబ పోషణ భారమైతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను చెల్లించి ఆదుకోవాలని అభ్యర్థించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వేతనాలు అందేలా చూస్తానని ఎంపీడీవో హామీ ఇంచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కమిటీ నాయకుడు పెంటయ్య, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

ఆదిభట్ల, జూలై 8: విద్యార్థులు చదువులో ముందుండాలంటే సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని షీ టీం ఎస్సై శ్రీనివాసులు అన్నారు. కొంగరకలాన్‌లోని శ్రీనివాస హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ఆన్‌లైన్,సైబర్ నేరాలు, విద్యార్థినులకు 'గుడ్ టచ్-బ్యాడ్ టచ్' లాంటివి వాటిపై ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలన్నారు. సెల్‌ఫోన్‌లో ఆడే గేమ్స్ ఆడొద్దన్నారు. అపరిచితులు పంపే లింక్‌లను ఓపెన్ చెయ్యొద్దని, అలా చేస్తే మన వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకుంటారన్నారు. సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930కు కాల్ చేసి చెప్పాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు ఎదుటి వ్యక్తులు తీసుకునే చనువుపట్ల అప్రమత్తంగా ఉండాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లను గుర్తించి తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ లక్కరాజు శ్రీనివాస్‌రావు, డైరక్టర్ రాధిక పాఠశాల, షీ టీం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత డబ్బుతో లింక్ రోడ్డు పనులు

చేవెళ్ల, జూలై 8: చేవెళ్ల మండలం రావులపల్లికి సొంత డబ్బుతో రోడ్డును మరమ్మతులు చేయించామని మాజీ సర్పంచ్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం రావులపల్లి నుంచి ధర్మసాగర్ వరకు మధ్యలో ఉన్న లింక్ రోడ్డును బాగు చేసి వాగుపై పెద్ద సిమెంట్ పైపులు వేయించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న లింక్ రోడ్డుకు సొంత డబ్బుతో మరమ్మతులు చేయించామన్నారు. రావులపల్లి గ్రామస్థులు చేవెళ్ల, శకంర్‌పల్లి మండలాలకు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా లింక్ రోడ్డును బాగు చేయించామన్నారు. ఈ రోడ్డు మరమ్మతులతో గ్రామస్థుల లింక్ రోడ్డు కల నేరవేరిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యాయబద్ధ పోరాటంతోనే మేలు

కేశంపేట, జూలై 8: కార్మికులు న్యాయబద్ధంగా పోరాటం చేస్తేనే మేలు జరుగుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు అన్నారు. కొత్తపేట శివారులోని వెంకటేశ్వర హ్యాచరీస్ కార్మికుల చేపట్టిన సమ్మె సోమవారంతో మూడో రోజుకు చేరుకుంది. కార్మికులకు మద్దతు ప్రకటిస్తున్నట్టు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు యాజమాన్యంతో మాట్లాడారు. నెలరోజుల వ్యవధిలో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వేతనాల పెంపు, ఓటీ, పర్మనెంట్ విషయాలను చర్చించినట్లు వివరించారు. కార్మికులు సమ్మె విరమించి పనుల్లో చేరాలని కోరారు. వెంకటేశ్వర హ్యాచరీస్ ఇచ్చిన హామీలు అమలుచేయకపోతే తిరిగి ఆందోళన చేద్దామని సూచించారు. సమ్మెలతోనే కార్మికులు హక్కులను సాధించుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం కార్మికులతో సమ్మెను విరమింపజేశారు. మంగళవారం నుంచి పనుల్లో చేరుతామని కార్మికులు తెలిపారు.

రామలింగేశ్వరుడి సేవలో
మల్కాజిగిరి జిల్లా కోర్టు న్యాయాధికారి

కీసర, జూలై 8: మల్కాజిగిరి జిల్లా కోర్టు న్యాయాధికారి బాల భాస్కర్‌రావు సోమవారం శ్రీ రామలింగేశ్వరుని దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈమేరకు బాలభాస్కర్ గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. శ్రీదుర్గా, భవానీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహా మండపంలో అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు సమర్పించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు అమ్మితే కఠిన చర్యలు

» మైసమ్మగూడలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

మేడ్చల్ టౌన్, జూలై 8: మాదకద్రవ్యాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు హెచ్చరించారు. మేడ్చల్ డీసీపీ జోన్ పరిధి గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలోని పలు హాస్టళ్లు, హోటళ్లు, స్మోకింగ్ జోన్‌లలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాలు విక్రయించే వారిని పట్టు కోవడానికి సోమవారం సాయంత్రం నార్కోటిక్ డాగ్స్‌తో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మైసమ్మ గూడ ప్రాంతంలో మల్లా రెడ్డి యూనివర్సిటీతో పాటు పలు విద్యాసంస్థలు పెద్దఎత్తున ఉన్నాయి. దాదాపు కొన్ని వేల మంది విద్యార్థులు ఇక్కడ విద్యాసంస్థల్లో చదువుతూ హాస్టళ్లలో ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న దుకాణాలు, కాఫీ, టీసెంటర్లు, స్మోకింగ్‌జోన్, జ్యూస్ సెంటర్, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కిరాణా దుకాణాల్లో అమ్మే చాక్లెట్లను, ఇతర తినుబండారాలను పరిశీలించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కాకూడదన్న ఉద్దేశ్యంతో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైసమ్మ గూడ ప్రాంతం విద్యాసంస్థల హబ్ కావడంతో ఇక్కడ ప్రత్యేంగా నిఘాను ఏర్పాటుచేసి ఇక్కడ నిరంతరం తనిఖీలు చేపడుతామని పోలీసులు తెలిపారు.

నియామకపత్రాలు ఇవ్వాలి

వికారాబాద్, జూలై 8: గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 81, 85 ప్రకారం రాష్ట్రంలోని 3797 మంది 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు త్వరగా నియామక ఉత్తర్వులు ఇప్పించాలని వీఆర్‌ఏల వారసులు శ్రీకాంత్, జనార్దన్‌లు కోరారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 5 నుంచి 10సంవత్సరాలుగా 61 సంవత్సరాల వయసు దాటిన వీఆర్‌ఏల వారసులంతా ఉన్నత విద్యార్హతలు కలిగి ఉండడం వల్ల తమ సేవలను తహసీల్దార్ కార్యాలయంలో అందిస్తూనే ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం తమ కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, మానసికంగా కూడా ఎంతో కుంగిపోతున్నామన్నారు. ఇప్పటి వరకు 17మంది వీఆర్‌ఏలు కూడా మృతిచెందారని తెలిపారు. జీవో 81, 85 ప్రకారం మొత్తం 16758 మంది వివిధ శాఖల్లో వారి వారి అర్హతలను బట్టి నియామక ఉత్తర్వులు, ఐడీలు కూడా ఇచ్చారని, కానీ మా 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏ వారసులకు ఇప్పటి వరకు ఎలాంటి నియామక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, శ్రీనివాస్, జనార్దన్, రాజు, శేఖర్, యాదయ్య, సంగమేశ్వర్, నర్సింహులు, సందీప్ పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు

» జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, జూలై 8 : పద్నాలుగు ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే ఆ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆపరేషన్ ముస్కాన్ పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా తప్పిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగిస్తామని చెప్పారు. బాల్యాన్ని, బాలల హక్కులను హరించడం నేరమని అన్నారు. 14 ఏళ్ల లోపు చిన్నారులు చదువుకునేందుకు బడుల్లో ఉండాలే తప్ప పనిలో ఉండకూడదని ఆమె అన్నారు. పిల్లలను పనిలో పెట్టుకునే యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికులను గుర్తించి వారిని రక్షించే ప్రయత్నం చేయనున్నట్లు చెప్పారు. ఆపరేషన్ ముస్కాన్‌లో పట్టుబడిన బాలకార్మికులను వారు తిరిగి చదువుకునేందుకు వసతిగృహాల్లో చేర్పిస్తామని ప్రతిమాసింగ్ తెలిపారు. బాల కార్మికులతోపాటు భిక్షాటన, చెత్త సేకరించుకునే బాలలు, వీధి బాలలు కూడా ఆపరేషన్ ముస్కాన్‌లో గుర్తిస్తామని ఆమె తెలిపారు. పిల్లల్లో మానసిక పరివర్తనకై కౌన్సెలింగ్ ఇప్పించి చదువుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో సైబరాబాద్, రాచకొండ పరిధిలో 11 ఆపరేషన్ ముస్కాన్ టీములు పని చేస్తున్నాయని తెలిపారు. ప్రతీ ఒక్క కేసును బాధ్యతగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. డీసీపీఓలు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించి ఇటుక బట్టీల్లో, భవన నిర్మాణాల్లో పనిచేసే పిల్లలను గుర్తించి వారిని కాపాడాలని డీసీపీవోలను ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో, సమష్టిగా పనిచేసి బాల కార్మికులను రక్షించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా శిశు సంక్షేమాధికారి పద్మజా రమణ, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రాజేశ్వరీ దేవి, ఆర్డీవోలు సూరజ్ కుమార్, సాయిరాం, అనంత్‌రెడ్డి, సైబరాబాద్, రాచకొండ పోలీసు అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ చైర్‌పర్సన్ నరేందర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సీడీపీవోలు, ఎన్జీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి
రూ.450కోట్లు మంజూరు

» నిరుద్యోగులకు 2 లక్షలు ఉద్యోగాలు ఇస్తాం

» ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం.

» స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్.


పాలకవర్గాన్ని సన్మానించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, జూలై 8: వికారాబాద్ నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి రూ.450 కోట్ల మంజూరుతీసుకున్నామని, అనంతగిరిని రూ.500 కోట్లతో అభివృద్ధి చేస్తామని స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. ధారూరు మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో సోమవారం మండల పరిషత్తు పాలకవర్గం వీడ్కోలు సమావే శానికి హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణం జరగలేదని, వాటికి కేటాయించిన నిధులతో ముందుగా ప్రధాన రోడ్ల నిర్మాణం, ఇతర నిధులతో పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణం చేపడుతామన్నారు. అనంతగిరి కొండలను అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలను ఇస్తామని, ఇప్పటికే ప్రభుత్వం 30వేల ఉద్యోగాలను ఇచ్చిందని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం వికారాబాద్ జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరుస్తామని ఆయన చెప్పారు. ఆరు గ్యారంటీలనుఅమలు చేస్తామని, ఐదేళ్లలో నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామని తెలిపారు. అనంతరం పదవీకాలం ముగిసిన మండల ప్రజా పరిషత్తు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ సుజాత, జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సంతోష్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, పి.రాములు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్ గుప్తా

ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్

వికారాబాద్, జూలై 8: ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నూతనంగా ఎంపికైన జిల్లా అధ్యక్షుడు మాలే లక్ష్మణ్ గుప్తాతోపాటు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడిగా ఈరెల్లి రఘునందన్, ప్రధాన కార్యదర్శి యాస్కి సునీల్ కుమార్, కోశాధికారిగా దోమ శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా మ్యాడం వేనుగోపాల్, పాలకవర్గ సభ్యులు ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలుగా మ్యాడం లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా కొట్టి విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా యాస్కి సువర్ణ, కోశాధికారిగా పోకల మమత, సహాయ కార్యదర్శిగా కుంచం శ్రీదేవి, కార్యవర్గ సభ్యులుగా ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షుడు మోముల భరత్ కుమార్, ఆలూరి రాఘవేందర్, కోశాధికారిగా పోలా సాయికుమార్, కార్యదర్శిగా రాచూరి సాయిగుప్తాను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులందరికీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం తరుపున స్పీకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం జిల్లానాయకులు ఆర్యవైశ్య సంఘం పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపవైద్యాధికారి దామోదర్

శంకర్‌పల్లి/ఆమనగల్లు, జులై 8: సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్‌లో సోమవారం సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఫాగింగ్ తప్పక చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకయ్య గౌడ్, ఎంపీవో గీత, ఏపీఎం భీమయ్య, ఏపీవో నాగభూషణం ఆశా వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమనగల్లు మండల స్పెషలాఫీసర్ సుజాత కోరారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమనగల్లు మండల పరిషత్‌లో సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పెషలాఫీసర్ పంచాయతీల వారీగా సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. తాగునీరు కలుషితం కాకుండా పైపు లైన్ల లీకేజీలను అరికట్టాలని, ట్యాంక్‌లను శుభ్రం చేయించాలన్నారు. దోమలను నివారించి మలేరియా, డెంగ్యూ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కుసుమమాధురి, ఎంపీవో ఉమారాణి, వైద్యులు మంజుల, విజయ, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏపీవో మాధవరెడ్డి పాల్గొన్నారు.



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న అధికారి సుజాత

వీఆర్‌ఏ వారసులకు
నియామక ఉత్తర్వులివ్వాలి

» కలెక్టర్‌కు వీఆర్‌ఏ వారసుల విజ్ఞప్తి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్న వీఆర్‌ఏలు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూలై 8 : రెవెన్యూశాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తూ మృతి చెందిన వీఆర్‌ఏల కుటుంబాలపై సర్కార్ కారుణ్యం చూపడం లేదని, వీఆర్‌ఏల వారసులకు వెంటనే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల వారసులు మాట్లాడుతూ తమకు ఉద్యోగాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. దరఖాస్తులు పట్టుకుని ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 81ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం 3,797మంది 61 ఏళ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియామకం కోసం జీవో నెంబర్ 81, 85 జారీ చేసిందని, కానీ.. ఈ జీవోలపై స్టే ఉన్న కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. హైకోర్టులో జీవో నెంబర్ 81పై ఉన్న స్టేను ఎత్తివేసిందని చెప్పారు. 20,555 మందిలో 16,758 మంది వివిధ శాఖల్లో వారి అర్హతను బట్టి నియామక ఉత్తర్వులు, ఐడీలు కూడా పొందారని వివరించారు. మిగిలిన 3,797 మందికి ఇప్పటివరకు ఎలాంటి నియామక ఉత్తర్వులూ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని వీఆర్‌ఏల వారసులకు నియామకాలు చేపట్టాలని కోరారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య నియామకాలకు అనుమతి ఇస్తూ 81,82 జీవో జారీ చేసిందన్నారు. ఈ జీవో ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసుల వివరాలు సీసీఎల్‌ఏ ఆదేశాల మేరకు తహసీల్దారు కార్యాలయాల నుంచి కలెక్టరేట్లు డేటాను సేకరించిందని చెప్పారు. వారసుల వివరాలలో భాగంగా జీవో ప్రకారం విద్యార్హతలు సర్టిఫికెట్లు, ఫ్యామిలీ నెంబర్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు, అఫిడవిట్, కుల, ఆధాయ, నివాస ధ్రువ పత్రాలు ప్రభుత్వానికి సమర్పించారని. ఇదంతా జరిగి 11 నెలలు గడిచినా వీఆర్‌ఏ వారసులకు నియామక ఉత్తర్వులు జారీ చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్‌ఏ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తరగతి గది శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బషీరాబాద్, జూలై 8: 'ఇదేం క్లాస్‌రూమ్?' తరగతి గది అస్తవ్యస్తం అంటూ 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో సోమవారం ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ విద్యాధికారి సుధాకర్‌రెడ్డి స్పందించారు. ఈ విషయమై మండలంలోని కాశీంపూర్ తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్‌ను విద్యాధికారి తరగతి గది దుస్థితిపై ఆరా తీశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద అక్కడ ఎవరు పని చేశారని ఆరాతీసి వెంటనే తరగతి గదిని శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయుడిని ఆదేశించారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు వారిని పిలిపించి తరగతి గదిలోని ఇటుకలు, సిమెంట్, ఇతర సామగ్రిని మొత్తం దగ్గరుండి క్లీన్ చేయించారు. అనంతరం తరగతి గదిలో బెంచీలను క్రమ పద్ధతిలో వేయించి విద్యార్థులను కూర్చోబెట్టారు. ఆంధ్రజ్యోతి కథనంతో విద్యాశాఖ అధికారులు స్పందించి క్లాస్‌రూమ్ క్లీన్ చేయించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ ఎంపీటీసీ హత్యకేసులో
కౌన్సిలర్ మల్లేష్‌ను అరెస్టు చేయాలి

ఘట్‌కేసర్, జూలై 8: ఘట్‌కేసర్‌లో దారుణ హత్యకు గురైన మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్ హత్యకు కారణమైన కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్‌ను తక్షణమే అరెస్టు చేయాలని మృతుడి కుటుంబసభ్యులు, రాష్ట్ర మాల మహానాడు నాయకులు సోమవారం మల్కాజిగిరి డీసీపీ పీవీ పద్మజకు ఫిర్యాదు చేశారు. గతనెల 15వ తేదీన మహేష్‌కు చెందిన రియలెస్టేట్ కార్యాలయంలోనే దారుణంగా హత్యచేసి కొండాపూర్ సమీపంలోని చెత్తడంపింగ్ యార్డులో పాతిపెట్టిన విషయం తెలిసిందే. ఈహత్యకేసులో తమకు పోలీసులు ఎలాంటి వివరాలు చెప్పకుండా గోప్యత పాటిస్తున్నట్లు కుటుంబసభ్యులు మొదటి నుంచి అనుమానం వ్యక్తంచేస్తున్నారు. సోమవారం తాజాగా డీసీపీని కలిసి ఈహత్యలో సంబంధమున్న కౌన్సిలర్ మల్లేష్‌ను కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహేష్ మృతదేహాన్ని వెలికితీసిన రోజు హత్యకు భూతగదాలే కారణమని ఏసీపీ వివరించినట్లు తెలిపారు. మల్లేష్‌కు మృతుడు మహేష్‌కు భూతగాదా ఉన్నప్పటికీ ఆయన్ను మాత్రం అరెస్టు చేయకుండా ఆయన అనుచరులనే అరెస్టు చేసి కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులలో వివరించారు. మహేష్ హత్యకు అసలు కారకుడు మల్లేష్ అని వాపోయారు. రాజకీయ ఒత్తిళ్లతోనే అతన్ని తప్పిస్తున్నారని ఈకేసులో అసలు నేరస్తులను అరెస్టు చేసి న్యాయం చేయాలని మృతుడి తల్లి గడ్డం మైసమ్మ, సోదరుడు గడ్డం విఠల్, అక్కలు, బావలు, మాలమనాఆడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, నాయకులు చంద్రశేఖర్, చిప్పల నర్సింగరావు, బూడిద నాగరాజు, సంజీవ, బిక్షపతి, శ్రీనివాస్ డీసీపీని కలిసి వివరించారు.

కదిలిన యంత్రాంగం

» చిలుక వాగు సర్వే ప్రారంభం

» త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశం


చిలుక వాగును పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూలై 8: 'ముంపుపై ముందస్తు ప్రణాళిక ఏది?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చిలుక వాగు పనులు త్వరగా పూర్తి చేసేందుకు ఎందుకు తాత్సారం చేస్తున్నారని వెంటనే సర్వేను పూర్తి చేయాలని, ఈ రోజే సర్వే ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, మున్సిపల్ యంత్రాగం ప్రధాన సమస్యగా ఉన్న చిలుకవాగు సర్వేను ప్రారంభించారు. ఇరిగేషన్ డీఈ కిష్టయ్య, ఆర్ఐ నారాయణరెడ్డి, సర్వేయర్ మహేష్, మున్సిపల్ అధికారి ఉమేష్‌లతో పాటు ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ సర్వేలో పాల్గొన్నారు.

నీటిప్రవాహానికి అడ్డంకి లేకుండా చూడాలి: ఎమ్మెల్యే

ప్రస్తుత వర్షకాలంలో నీటి ప్రవాహనికి అడ్డంకిగా లేకుండా సర్వే చేపట్టాలని అధకారులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే ఫోన్ ద్వారా అధికారుల సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షకాలంలో రోడ్లపై కాలనీలోకి నీళ్లు రాకుండా ఉండేందుకు కాల్వలు తీయించేందుకు గుర్తించాలని ఆదేశించారు.

చిలుకవాగు ప్రక్షాళనకు రోజుకో మలుపు

చిలుక వాగు ప్రక్షాళన రోజుకో మలుపు తిరుగుతున్నదని చెప్పవచ్చు. చిలుక వాగు హైదరాబాద్ రోడ్డు మార్గం మొదలుకొని కోకట్ శివారులో ముగుస్తుదని, ఈ నీరంతా కాగ్నా నదిలో కలుస్తుందని సర్వేలో నిర్ధారించారు. నక్ష ఆధారంగా సర్వే నంబర్లు 36, 39, 41, 47, 48, 52, 53, 57, 58, 59, 62, 63లలో ప్రవాహ మార్గం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు చిలుకవాగులో కొన్నేళ్ల నుంచి రోడ్లు, డ్రైనేజీలు, భవన నిర్మాణాలు, ఖాళీ ప్లాట్లు వెలిశాయి. ప్రస్తుతం అధికారులు చిలుక వాగు సర్వే చేపట్టడంతో పలువురు ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. చిలుకవాగు ప్రవాహ మార్గంలో తమకు చెందిన ప్లాట్లలో నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో చిలుక వాగు మార్గం లేదని తమకు ప్లాట్లను విక్రయించారని తెలిపారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

టీఎస్‌పీఎస్సీలో రాష్ట్రస్థాయిలో
మొదటి ర్యాంకు సాధించిన అధ్యాపకుడు

కొడంగల్, జూలై 8: టీఎస్‌పీఎస్సీ పరీక్షలో జేఎల్ సబ్జెక్టులో రాష్ట్ర స్థాయిలో అధ్యాపకుడు మొదటి ర్యాంకు సాధించాడు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ గెస్ట్ అధ్యాపకుడిగా పని చేసిన పెద్దేముల్ మండలం ఇందూర్ గ్రామానికి చెందిన మొహ్మద్ అఫ్రోజ్ సోమవారం విడుదలైన పరీక్షా ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించారు. ఉర్దూ పోస్టులు 28కి గాను మొత్తం 1,813 మంది పరీక్ష రాయగా అందులో మొహ్మద్ అఫ్రోజ్ 450 మార్కులకు 382.95 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల కళాశాల అధ్యాపకులు ఆయనను అభినందించారు.

ఏసీబీ అధికారులమంటూ ఉద్యోగికి టోకరా

» రూ. ఐదు లక్షలు స్వాహా చేసిన కేటుగాళ్లు

» ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా వసూలు

» ట్రాప్ చేసి నిందితులను పట్టుకున్న తాండూరు పోలీసులు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు, జూలై 8: ఏసీబీ అధికారులంటూ ఓ ఎంపీడీవోను బెదిరించి రూ. ఐదు లక్షలు స్వాహా చేసిన సంఘటనను తాండూరు పోలీసులు చేధించారు. డబ్బులు ఇవ్వకపోతే కేసు నమోదు చేస్తామని సదరు ఎంపీడీవోను కేటుగాళ్లు బెదిరించారు. తాండూరు పోలీసులు ఫోన్ నంబర్లను ట్రాప్ చేసి నిందితులను పట్టుకున్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు పట్టణం సాయిపూర్ ప్రాంతానికి చెందిన బండి లక్ష్మప్ప బెజ్జంకి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. గతనెల 16వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఎంపీడీవో లక్ష్మప్పకు ఫోన్ చేసి నీపై ఏసీబీకి ఫిర్యాదు వచ్చిందని పూర్తి సమాచారం మా వద్ద ఉందని పేర్కొంటూ రూ. 5లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే ఏసీబీ కేసు నమోదు అవుతుందని హెచ్చరించారు. దీంతో లక్ష్మప్ప నిందితులకు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ. 5లక్షలు చెల్లించారని డీఎస్పీ పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం చిక్బల్లాపూర్ గ్రామానికి చెందిన తరుణ్‌గౌడ (19), ఆర్టీసీ మెకానిక్ పని చేస్తున్న ముజాహిద్ (24) స్నేహితులు, అనంతపురం జిల్లా కొట్టలపల్లి గ్రామానికి చెందిన జయకృష్ణతో జత కలిశారని, ఈ ముగ్గురు ముఠాగా ఏర్పాడి ఏసీబీ అధికారులంటూ ఫోన్లు చేసి డబ్బులు అడుగుతూ, ఇవ్వకపోతే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. లక్ష్మప్పను గత నెల 20వ తేదీన ఫోన్ చేసి డబ్బులు అడుగగా ఇచ్చిన లక్ష్మప్పకు అనుమానం వచ్చి తాండూరు పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో నిందితులు మహబూబ్‌నగర్ వచ్చినట్లు సమాచారం అందింది. బస్టాండ్‌లో తరుణ్ గౌడ, ముజాహిద్‌లను అదుపులోకి తీసుకుని తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, రూ.లక్ష స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా నేరాన్ని అంగీకరించారు. మరోవైపు కేసులో ప్రధాన నిందితుడు అయిన జయకృష్ణ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. నిందితులపై 3 కేసులు ఉండగా, ప్రధాన నిందితుడు జయకృష్ణపై మొత్తం 31 కేసులు ఉన్నాయని వెల్లడించారు.


ఘట్‌కేసర్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


తాండూరు: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు


శామీర్‌పేట: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


ఘట్‌కేసర్ రూరల్: అంకుశాపూర్‌లో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు


పరిగిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్నఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ప్రజల గుండెల్లో నిలిచిన మహానేత వైఎస్సార్

పరిగి, జూలై 8: పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత వైఎస్సార్ అని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పరిగిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు కోళ్ళ యాదయ్య పరిగిలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దేముల్: మండలంలోని తట్టేపల్లిలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ ఎండీ రియాజ్, తట్టెపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు, ఉపసర్పంచ్ కిష్టప్ప, మాజీ డైరెక్టర్ నారాయణ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జోగు హన్మంతు, నాయకులు జగన్, ఇమ్రాన్ పటేల్, సజిత్, వార్డుసభ్యులు షాపురం శివన్న, బిచ్చప్ప పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: వైఎస్సార్ జయంతి వేడుకలను సోమవారం మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ చెక్‌పోస్టు జాతీయ రహదారి సుతారిగూడ చౌరస్తా వైఎస్ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ, మండలంలోని గ్రామాల్లో గల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ రెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, నారెడ్డి రవీందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బూషి, రమేష్, కౌన్సిలర్లు కొడె మహేష్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, జాకట దేవరాజ్, చాపరాజు పాల్గొన్నారు.

శామీర్‌పేట: ప్రజల హృదయాల్లో నిలిచిన మహానుబావుడు వైఎస్సార్ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ అన్నారు. శామీర్‌పేటలోని రాజీవ్‌రహదారి ప్రధానచౌరస్తా వద్ద సోఓమవారం వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముజీబ్, అశోక్, గుల్యాగారి బాల్‌రాజ్‌గౌడ్, కిశోర్, సుధాకర్‌రెడ్డి, ఇంధిర, తుంకి భిక్షపతి, మహేందర్‌యాదవ్, తుంకి రమేశ్ పాల్గొన్నారు. అదేవిధంగా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్‌లో మున్సిపల్ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌గౌడ్, పి.బాలేష్, లక్ష్మినారాయణ, మురళీగౌడ్, హరిగోపాల్, దర్శన్‌గౌడ్, రాంచందర్‌యాదవ్, దుర్గయ్య, బల్వంత్‌రెడ్డి, నాయకురాలు భారతమ్మ, అక్షిత పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: వైఎస్సార్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్ తెలిపారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం ఘనాపూర్, అంకుషాపూర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బద్దం గోపాల్‌రెడ్డి, నానావత్ రూప్‌సింగ్‌నాయక్, నాయకులు సందీప్‌రెడ్డి, మెట్టు రమేష్, పరమేష్ గౌడ్, నానావత్ సురేష్‌నాయక్, మాదవరెడ్డి, గోవర్ధన్‌గౌడ్, మల్లారెడ్డి, భాస్కర్, వెంకట్‌రెడ్డి, శివాజీ నాయక్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్: ఉమ్మడి రాష్ట్రానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. వైఎస్సాఆర్ జయంతి సందర్భంగా సోమవారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మోమిన్‌పేట్: దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట్, జూలై 8: ప్రతీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో యాదగిరి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఏఈ ప్రణీత్, పశువైద్య శాఖ అధికారిణి గీత, ఏపీవో శంకరయ్య, ఏపీయం రాజు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నిజానంద్, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజావాణిలో ఒకే దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీవో ఉషశ్రీ తెలిపారు. ఆలేడు గ్రామ పంచాయతీ పరిధిలోని 387 సర్వే నెంబరులో భూమిని సర్వే చేయించాలని దరఖాస్తుదారుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, ఎంఈవో రాంరెడ్డి, ఏపీయం వెంకన్న, ఏపీవో రాములు, పశువైద్యుడు పరమేశ్, హనుమంతు రెడ్డి, ఏఈవో రాజు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఒక్కటే దరఖాస్తు రావడం జరిగిందని మేనేజర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఫించన్‌కు సంబంధించిన దరఖాస్తు మాత్రమే రావటమైందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె. నిర్మల, ట్రాన్స్‌కో అధికారి మల్లారెడ్డిలు ఉన్నారు.

కులకచర్ల: ప్రజావాణిలో వచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తామని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. కులకచర్ల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సోమవారం 34దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఎంఈవో హబీబ్ అహ్మద్, ఏపీఎం శోభ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో సోమవారం జరిగిన ప్రజావాణిలో 11 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పోచారం మున్సిపాలిటీలో ఒకే ఫిర్యాదు వచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని పోచారం మున్సిపాలిటీ బీజేపీ నాయకులు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయావార్డుల్లో మొక్కలు నాటకుండానే నాటినట్లు చూపించి దాదాపు రూ.5కోట్లు, మెయింటెనెన్స్ పేరిట మరో రూ.3కోట్లు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. విచారణ జరిపి బాద్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. ఘట్‌కేసర్ లో గృహజ్యోతి సమస్యలు పరిష్కరించాలని బర్ల హరిశంకర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

ఘనంగా చిగుళ్లపల్లి రమేష్ జన్మదిన వేడుకలు


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్

వికారాబాద్, జూలై 8: మాజీ మునిసిపల్ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ జన్మదిన వేడుకలు సోమవారం వికారాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రమేష్‌కుమార్ అభిమానులు, స్నేహితులు సన్నిహితులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి గజమాలతో సత్కరించారు. అనంతరం చిగుళ్లపల్లి మైదానంలో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడ స్పీకర్ సమక్షంలో కేక్ కట్‌చేశారు.

మొక్కు తీర్చుకున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల, జూలై 8: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గెలవడంతో మండలంలోని పగిడ్యాల గ్రామానికి చెందిన సుమారు 100మంది కాంగ్రెస్ నాయకులు సోమవారం యాదగిరిగుట్టకు వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. పగిడ్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నర్సింహులు ఆధ్వర్యంలో సోమవారం పగిడ్యాల నుంచి యాదగిరిగుట్టకు బయలుదేరారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

తాండూరు రూరల్, జూలై 8: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంఈవో వెంకటయ్య ఆదేశించారు. తాండూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 15 పాఠశాలల్లో పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేశామని చెప్పారు. ఇంకా 20 పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ నందిని, ఏపీఎం ఆనంద్, ఎంపీవో రతన్‌సింగ్ పాల్గొన్నారు.

12న తలనీలాల పోగుకు వేలం

వికారాబాద్, జూలై 8: అనంతపద్మనాభ స్వామి దేవస్థానంలో ఆషాడ చిన్న జాతర నుంచి మళ్లీ వచ్చే సంవత్సరం ఆషాడ జాతర వరకు ఒక సంవత్సరం పాటు(జూలై 17 నుంచి 2025, జూలై 15 వరకు) తలనీలు పోగుచేసుకునే హక్కు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎస్. పద్మనాభం, ఆలయ ఈవో టి.నరేందర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. 12న మధ్యాహ్నం 12గంటలకు అనంతగిరి ఆలయ ప్రాంగణంలో వేలం ఉంటుందని తెలిపారు. పాల్గొనే వారు డిపాజిట్ రూ.10వేలు డిపాజిట్ చేయాలన్నారు. హక్కుపొందని వారికి డిపాజిట్ రుసుము వాపసు చేయనున్నట్లు తెలిపారు.

రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

పరిగి,జూలై 8: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతు సంక్షేమానికి ఇచ్చిన హామీన్నింటినీ నెరవేర్చాలని కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మారుతికిరణ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా పేరిట ఎకరాకు ఏటా రూ.15 వేలు ఇస్తామని చెప్పిన సీజన్ ప్రారంభమైనాఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

'స్పీకర్‌పై ఆరోపణలు చేస్తే సహించం'

మర్పల్లి, జూలై 8: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కోటమర్పల్లి గ్రామంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. కోటమర్పల్లి గ్రామంలో పదేళ్లుగా మద్య నిషేధం చేయడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి గ్రామాల్లో బెల్టు షాపులు ప్రారంభిండంలో ప్రసాద్‌కుమార్ అండదండలు ఉన్నాయని చేస్తున్న ప్రచారాన్ని వారు ఖండించారు.

ఎస్‌జీటీలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

వికారాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డీఎడ్, బీఎడ్ అర్హతలు కలిగిన ఎస్‌జీటీలకు పీఎస్ హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని పీఆర్‌టీయూ టీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడియాల చంద్రశేఖర్, దోమ అమర్‌నాథ్‌లు రాష్ట్ర సంఘానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, డిమాండ్లను వారు సంఘం రాష్ట్ర బాధ్యుల దృష్టికి తీసుకొచ్చారు. జీవోనెం.12లో సవరించి, రాష్ట్రంలో 5500 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని కోరారు. పదేళ్ల నుంచి నిలిచిపోయిన పదోన్నతులు, ఆరేళ్లుగా ఆగిన బదిలీలు జరిగే విధంగా ప్రభుత్వం అంగీకరింపజేసే విధంగా సంఘం రాష్ట్ర బాధ్యులు కృషి చేయడం ఎంతో అభినందనీయమన్నారు. సర్వీస్‌లో ఉన్న పీఈటీలు ఇన్‌సర్వీస్‌లో బీపీఎడ్ పూర్తిచేసే అవకాశం కల్పించాలని కోరారు. పదోన్నతుల ద్వారా భర్తీ కాకుండా మిగిలిన ఖాళీలను రోస్టర్‌తో సంబంధం లేకుండా అర్హత కలిగిన వారితో భర్తీ చేసే విధంగా కృషి చేయాలన్నారు. బదిలీల్లో చోటుచేసుకున్న తప్పులపై ఉపాధ్యాయులు చేసిన అప్పీళ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇప్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు, జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ, సరెండర్ బిల్లులు, రిటైర్డ్ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలన్నీ విడుదల చేసే విధంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరారు. కేజీబీవీ పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీలకు టైం స్కేల్ ఇప్పించాలని, మోడల్ స్కూళ్లలో పనిచేసే సిబ్బందికి బదిలీలు, పదోన్నతులు కల్పించాలని సూచించారు. సీపీఎస్ విధానం రద్దు చేసేవిధంగా ఒత్తిడి తీసుకు వచ్చేలా ఉద్యమ పంథాలో కృషి చేయాలని వారు సంఘం రాష్ట్ర బాధ్యులకు విజ్ఞప్తి చేశారు.


కలెక్టరేట్‌లో ఎన్కెపల్లి గ్రామస్తులు

భూ అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పూడూరు, జూలై 8: మండలంలోని ఎన్కెపల్లిలో గల సర్వేనెంబర్ 99, 101లోని భూమిలో కొంతమంది అవకతవకలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి సర్వేనెంబర్‌లోని సర్వేనెంబర్‌లో గల సమస్యలపై సోమవారం వినతిపత్రం అందించారు. ఈ విచారణతో ఎంతోమంది పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

'అక్రమాలతో కాంగ్రెస్‌కు సంబంధం లేదు'

ఎన్కెపల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 99లోని భూములను ఫేక్ ఆర్మీ వ్యక్తుల పేరుతో అధికార పార్టీ అండదండలతో ఖబ్జాకు పాల్పడుతున్నారంటూ వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్కెపల్లిలోని 99 సర్వేనెంబర్‌లో గల భూమిని కాంగ్రెస్ పార్టీ అండదండలతో అదే గ్రామానికి చెందిన బుజ్జురు రాములు, నరేందర్‌లు ఫేక్ ఆర్మీ వ్యక్తుల పేరుతో అన్యక్రాంతానికి పాల్పడుతున్నారంటూ వస్తున్న వార్తలను తాము ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు ఆనందం, సతీష్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పరిగి/దోమ: పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, దోమలో సోమవారం కల్యాణలక్ష్మి కింద 95మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సోమవారం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మత్స్య శాఖ కార్యదర్శి అంజనేయులు పాల్గొన్నారు.

● **కొడంగల్ రూరల్:** మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో అంగడి రైచూర్ పీహెచ్‌సీ వైద్యురాలు విద్యప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

● **పరిగి:** కేంద్రమంత్రి బండి సంజయ్‌ను సోమవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పరిగి ఇన్‌చార్జి, ఓబీసీ సెల్ ప్రధానకార్యదర్శి, సేవారత్నఅవార్డు గ్రహీత డాక్టర్ వెన్నె ఈశ్వరప్ప కలిసి సన్మానించారు.

● **కొడంగల్/బొంరాస్‌పేట్:** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి ప్రభుత్వం పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో బొంరాస్‌పేట్ మండల నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, నర్సింహులునాయుడు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

● **బషీరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఆంక్షలు పెట్టకుండా రైతులకు రైతుభరోసా, రూ.2లక్షల రుణమాఫీ అందించాలని బీజేపీ కిసాన్‌మోర్చా బషీరాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో రాజ్‌కుమార్ కులకర్ణి, ప్రశాంత్ తదితరులు తహసీల్దార్ వై.వెంకటేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.

● **బషీరాబాద్:** దామర్‌చెడ్ బీసీ కాలనీలో నెలకొన్న నీటి సమస్యపై ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో కథనం ప్రచురించగా ఎట్టకేలకు అధికారులు స్పందించి మరమత్తు చేయించారు.

మేడ్చల్ టౌన్:ప్రభుత్వం ప్రారంభించిన వనమహోత్సవ కార్యక్రమానికి మద్దతుగా సోమవారం మేడ్చల్ పట్టణంలో పాఠశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

● **మేడ్చల్ టౌన్:** 7వ వార్డులో రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మైనార్టీ మహిళలు సోమవారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

● **పరిగి:** స్కూల్ బస్సు డ్రైవర్లకు పరిగి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వీరేంద్రనాయక్ పరిగిలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు.

● **ఘట్‌కేసర్:** నారపల్లిలోని వైకుంఠ ధామం పనులను పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఆయన వెంట కౌన్సిలర్ సుర్వీ రవీందర్ గౌడ్, ఏఈ మహిపాల్ ఉన్నారు.

● **తాండూరు రూరల్:** చెంగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన హెచ్‌ఎం నర్సింహులు, ఉపాధ్యాయులను మాజీ జడ్పీటీసీ మంజుల వెంకటేష్, గౌడి వెంకటేశం, రత్నమాల సన్మానించారు.

● **కులకచర్ల:** కులకచర్ల పంచాయతీ పరిధిలోని చికెన్ సెంటర్ నిర్వాహకులకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం నోటీసులు అందించారు.

● **కులకచర్ల:** మండల కేంద్రంలో సివిల్ సప్లయి గోదాంను పునఃప్రారంభించాలని స్థానిక హమాలీలు సోమవారం తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు.

● **నవాబుపేట:** లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అకారణంగా పోలీసులు కేసులు పెడితే చూస్తూ ఊరుకోమన్నారు.

● **శామీర్‌పేట:** తూంకుంటలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ గ్రౌండ్స్‌లో సోమవారం ఓఎస్‌డీ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో అర్హులైన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక పోటీలను కోచ్‌లు ప్రారంభించారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** దివ్యానగర్ అభివృద్ధికి కృషిచేయనున్నట్లు దివ్యానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు నల్లా మల్లారెడ్డి తెలిపారు. కాచవాని సింగారం దివ్యానగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు.

● **వికారాబాద్:** కోటాలగూడ ప్రాథమిక పాఠశాలలో 94మంది విద్యార్థులకు అంకిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంకిత ఫౌండేషన్ వికారాబాద్ డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్‌స్కూల్ బ్యాగులు, మాట్స్, చెప్పులు ఉచితంగా అందజేశారు.

● **కీసర రూరల్:** నాగారం మున్సిపాలిటీలో నూతనంగా వెలుస్తున్న కాలనీల్లో ఏర్పాటు చేసేందుకు ఎల్‌ఈడీ విద్యుత్ నిధులు కేటాయించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి సోమవారం సీడీఎంఏ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీపతరావుకు వినతి పత్రం అందజేశారు.

● **దౌల్తాబాద్:** చంద్రకల్‌లో పశువైద్య కళాశాల నిర్మించనున్నట్లు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు బోడివెంకట్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **కొడంగల్:** కొడంగల్ ప్రాంతంలో గల వక్ఫ్ భూములను ఎవరైనా కబ్జా చేసి క్రయ విక్రయాలకు పాల్పడితే అధికారులు చర్యలు తీసుకోవాలని మైనారిటీ నాయకుడు ఎస్ఎం. గౌసన్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.

● **కొడంగల్:** మండల ప్రత్యేకాధికారిగా వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** అశ్వారావుపేట ఎస్ఐ శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన సీఐతో పాటు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎదులాబాద్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గుమ్మడి దుర్గేష్ డిమాండ్ చేశారు.

● **కులకచర్ల:** కులకచర్ల రైతు వేదికలో, చౌడాపూర్ మండలం మరికల్ గ్రామ రైతు వేదికలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏవో వీరస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగల అరెస్టు

● నిందితుల్లో ఒకరు మైనర్ ● రూ.12లక్షల సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

సరూర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను సోమవారం మీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేశారు. మీర్‌పేట్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా, రఘునాథ్‌పల్లి మండలం బానాజీపేట్‌కు చెందిన వల్లెపు జితేందర్ అలియాస్ జిత్తు(20) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్ మండలంలోని పీర్జాదిగూడలో నివాసముంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మహబూబాబాద్ జిల్లాలోని బీటీనగర్‌కు చెందిన రాపోల్ చందు అలియాస్ కృష్ణ(21) ఉప్పల్‌లో ఉంటూ సెంట్రింగ్ పని చేస్తున్నాడు. వరంగల్ జిల్లా గూడూరుకు చెందిన రాపోల్ శ్రీశైలం అలియాస్ చిన్నా(34) ఉప్పల్‌లోని బీరప్పగడ్డలో నివసిస్తూ లేబర్ పనిచేస్తున్నాడు. వీరు ముగ్గురితో పాటు మరో బాల నేరస్తుడు కలిసి జట్టుగా ఏర్పడి రాత్రి వేళల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి సొత్తు చోరీ చేయడం ప్రవృత్తిగా పెట్టుకున్నారు. జిత్తు, కృష్ణ, బాల నేరస్తుడిపై వనస్థలిపురం, మీర్‌పేట్, మేడిపల్లి పీఎస్‌లలో పలు కేసులు నమోదయ్యాయి. వారంతా పలుమార్లు జైలుకు సైతం వెళ్లి వచ్చారు. సదరు ముగ్గురు జైలు నుంచి(బాల నేరస్తుడు అబ్జర్వేషన్ హోమ్ నుంచి) బయటకు వచ్చిన తర్వాత రాపోల్ శ్రీశైలంను పరిచయం చేసుకుని మళ్లీ చోరీలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఇటీవల బడంగ్‌పేట్ మారుతీనగర్‌కు చెందిన రమేశ్ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన మీర్‌పేట్ పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు జరిపి నలుగురు నిందితులను సోమవారం హయత్‌నగర్ ప్రాంతంలో అరెస్టు చేశారు. వారి నుంచి 125 గ్రాముల బంగారు నగలు, 450 గ్రాముల వెండి వస్తువులు, ఒక బైక్, ఒక ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తు విలువ రూ.12లక్షలు ఉంటుందని ఏసీపీ కాశీరెడ్డి చెప్పారు. నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించారు.

కల్లు దుకాణం వద్ద వ్యక్తి హల్‌చల్

● కట్టేసి దేహశుద్ధి చేసిన స్థానికులు


పరిగి మార్కెట్‌లో గౌస్‌పాషా చేతులు కట్టేసి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

పరిగి,జూలై 8: ఓ వ్యక్తి కల్లు దుకాణం వద్ద హల్‌చల్ చేశాడు. కల్లు సేవిస్తున్న మహిళలపైకి గొడవకు దిగాడు. అసలు నువ్వు ఎవరని నిలదీయగా తాను పిల్లలను ఎత్తుకెళ్తానని చెప్పడంతో అక్కడున్న మహిళలు, స్థానికులు కలిసి అతడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన సోమవారం పరిగి మార్కెట్‌లో జరిగింది. ఉత్తర్‌ప్రదేశకు చెందిన ఎండీ గౌస్‌పాష పరిగిలోని ఓ స్క్రాప్ దుకాణంలో పని చేస్తుంటాడు. సోమవారం మద్యం సేవించి మార్కెట్‌యార్డు స్థలంలో నిర్వహిస్తున్న కల్లుదుకాణం వద్దకు వెళ్లాడు. తనే నేరుగా కల్లు సీసాలు తీసుకుని ఓ మహిళపైకి విసిరాడు. నీవేవరు,ఎందుకు అలా చేస్తున్నావని నిలదీయగా నేను పిల్లలను ఎత్తుకపోయేందుకు వచ్చాను అని దురుసుగా మాట్లాడడంతో అక్కడున్న మహిళలతోపాటు,స్థానికులు అతని చేతులు,కాళ్లు కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు వచ్చిన సదరు వ్యక్తిని స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ట్రెయినీ పైలట్ మృతి

కీసర రూరల్, జూలై 8: అవుటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ట్రెయినీ పైలట్ మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధి రాంపల్లిదాయరలో చోటుచేసుకుంది. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన శ్రీకరణ్‌రెడ్డి(26) తన కుటుంబసభ్యులతో కలిసి నెరేడ్‌మెట్‌లో నివాసముంటున్నాడు. యాదగిరిగుట్టకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తెల్లవారుజామున 4గంటలకు తన కారులో ఇంటి నుంచి బయల్దేరాడు. ఈ క్రమంలో కీసర వద్ద అవుటర్ రింగ్ రోడ్డుపైకి ఎక్కి కొద్ది దూరం ప్రయాణించిన తర్వాత రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో అతడికి తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బ్యాంకాక్‌లో పైలట్ ట్రైనింగ్ పొందుతున్న శ్రీకర్‌రెడ్డి వారం రోజుల కిందటే సెలవుపై ఇంటికి చేరుకున్నట్లు సమాచారం. ఈలోపే ప్రమాదానికి గురై మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. కారు లారీ ఢీకొని ప్రమాదం జరిగిందా? లేక డివైడర్‌ను ఢీకొన్నదా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి నాలుగేళ్లు జైలు

మేడ్చల్ టౌన్, జూలై 8: హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి మేడ్చల్ అడిషనల్ సెషన్ కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు పీపీ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో షాలిమ్ రాజు అనే వ్యక్తిపై వెంకట సుబ్బారావు పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో షాలిన్ రోజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మేడ్చల్ అడిషనల్ సెషన్ కోర్టు న్యాయాధికారి అర్జున్ ముందు హాజరుపరిచారు. కేసుకు సంబంధించి ఇరు వర్గాల వాదోప వానలు విన్న న్యాయాధికారి ముద్దాయి వెంకట సుబ్బారావుకు సెక్షన్ 307 నేరానికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా, సెక్షన్ 504 నేరానికి సంవత్సరం పాటు జైలు రూ.500 జరుమాన, సెక్షన్ 341 నేరానికి నెల రోజుల పాటు జైలు శిక్షతో పాటు జరుమానా విధుస్తూ తీర్పునిచ్చారు.

ఉద్యోగం పేరుతో మోసం.. నిందితుడికి 6 నెలలు జైలు

పరిగి, జూలై 8: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన నిందితుడికి పరిగి మున్సిఫ్ కోర్టు జైలు శిక్షతోపాటు, జరిమానా విధించింది. పరిగి కోర్టు న్యాయాధికారి నాగుల శిల్ప తీర్పును వెలువరిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని యాభాజీగూడ గ్రామానికి చెందిన జి.శేఖర్, సయ్యద్‌మల్కాపూర్ గ్రామానికి చెందిన కె.అంజయ్యకు రూ.లక్షన్నర ఇస్తే ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు తీసుకున్నాడు. డబ్బులు ఇచ్చిన తర్వాత నెలలు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో అంజయ్య, శేఖర్‌ను నిలదీశాడు. డబ్బులు తానే వాడుకున్నానని ఇస్తానని పలుమార్లు నమ్మించారు. ఇలా ఏళ్లు గడువడంతో అంజయ్య పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2017లో శేఖర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. కేసులోని పూర్వాపరాలను పరిశీలించిన న్యాయాధికారి నిందితుడికి ఆరునెలలు జైలు శిక్షతోపాటు, రూ.5వేల జరిమానా విధించారు. ఈకేసులో పీపీగా దీపారాణి, ఐవోలు కృష్ణ ఓబుల్‌రెడ్డి, సంతోష్, సీడీవో బి.రమేశ్‌లు వ్యవహరించారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

తాండూరు, జూలై 8: సుమారు రూ.80వేల విలువైన గుట్కాప్యాకెట్లను తాండూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు.. జిల్లా టాస్క్‌ఫోర్స్, తాండూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి తాండూరు పట్టణం గాంధీనగర్‌లోని నాగరాజు ఇంటి వద్ద నిషేధించబడిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు

తాండూరు రూరల్, జూలై 8: కరన్‌కోట్-ఓగీపూర్ మార్గంలో పేకాట స్థావరంపై దాడిచేసి పట్టుకున్నట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కరన్‌కోట్-ఓగీపూర్ వెళ్లే మార్గంలో కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పేకాడుతున్న ఆరుగురు కావలి నర్సింహులు, ఎండీ.ఫారుక్, షేక్ మహబూబ్, బాల లింగప్ప, సోయిని జగదీష్, ఎండీ.ఇమ్రాన్‌లను పట్టుకున్నారు. వీరినుంచి రూ.6,300లు సీజ్‌చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించండి

బొంరాస్‌పేట్, జూలై 8: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని రైతులు కలిసి వినతి పత్రం అందించారు. సోమవారం బొంరాస్‌పేట్ మండలంలోని బాపల్లితండా పరిధిలోని సర్వే నెం.193లో భూ సమస్యలు ఉన్నాయని రైతులు మోత్యానాయక్, సంతోష్ ఆధ్వర్యంలో సీఎంను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందించారు.


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రైతులు